ప్రజాశక్తి
బుధవారం 16 ఏప్రిల్ 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

ఇంకొల్లు మండలంలోని కొనికి కట్టావారిపాలెం వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన పొగాకు రైతులు

- నల్లబర్లీని గిట్టుబాటు ధరకు కొనాలని డిమాండ్
- రైతుసంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నల్లబర్లీ పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతుసంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో పర్చూరులో, ఇంకొల్లులో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ▶ 2లో

పర్చూరులో నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

ఆ నివేదికపైనే చర్చ..!

- ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే నిర్వహించిన ఓ సంస్థ
- ఉమ్మడి ప్రకాశంలో నలుగురి పరిస్థితి బాగాలేదని వెల్లడి
- ఇందులో హామీలపై దృష్టి పెట్టని ప్రభుత్వ పాత్ర ఎంతన్నదీ గప్‌చుప్.!

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన పది నెలల్లో పాలకపక్ష ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందనే దానిపై ఓ సంస్థ సర్వే నిర్వహించింది. ఉమ్మడి జిల్లాల వారీగా ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందో నేరుగా ఎమ్మెల్యేలకే నివేదించారు. ఇప్పుడు ఆ సర్వే సారాంశం నేతల మధ్య తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఎవరి పరిస్థితి ఏమిటన్న దానిపై పరిశీలన చేసుకొని అంతర్మథనం చెందుతున్నారు. ప్రభుత్వమే ఈ సర్వే చేయించిందని సమాచారం. ఎవరిపై ప్రజలు ఏ స్థాయిలో సంతృప్తితో ఉన్నారన్నది ఈ సర్వే నివేదిక. దీనిపై ఇప్పటికే చర్చ మొదలైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నలుగురు తెలుగుదేశం ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదని సర్వేలో వెల్లడైంది. వీరిని సర్వే జాబితాలో చేర్చారు. 30 శాతం కన్నా తక్కువ మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసిన వారిలో ఈ నలుగురు ఉన్నారు. ఇప్పుడు వీరిదే హాట్‌టాపిక్‌గా మారింది. పశ్చిమాన ఇద్దరు, తూర్పు ప్రాంతంలో ఇద్దరు ఎమ్మెల్యేలున్నారు. మిగతా ఎమ్మెల్యేలు తరతమ స్థాయిలో ఉన్నారు. మంత్రులు ఇద్దరూ సేఫ్ జోన్‌లోనే ఉన్నారు. ఎవరన్నది పార్టీలో అందరికీ తెలిసిందే. ఎమ్మెల్యేల పనితీరుపైనే సర్వే నిర్వహించిన నేపథ్యంలో కేవలం వారి పనితీరు ఒక్కటే అసంతృప్తికి కారణంగా చూపలేమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వ పని తీరును బట్టే ఎమ్మెల్యేల పనితీరు ప్రధానంగా ఉంటుంది. వ్యక్తిగత పోకడలు, ప్రజలకు అందుబాటులో ఉండక పోవడం, ప్రజలు వచ్చినప్పుడు వారికి ఇచ్చే మర్యాద, రిసీవింగ్, పిఏల పనితీరు కూడా ఎమ్మెల్యేల పనితీరుకు దోహదం చేస్తాయి. ప్రధానంగా ఎమ్మెల్యేల పనితీరు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతోనూ ముడిపడి ఉంటుంది. దాన్ని పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వంపై వచ్చే అసంతృప్తిని ఏదో రకంగా ఎవరిపైనో నెట్టేసే యత్నంగా ▶ 2లో

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాల్యవివాహాలను అరికట్టేందుకు చర్యలు

▶ 2లో

టిడ్కో ఇళ్లలో తిరకాసు.!

- ఉచిత ఇళ్లకు సంబంధించి ఏడు బ్లాకులు రద్దు చేసే యోచనలో టిడిపి ప్రభుత్వం
- 336 మంది పేదలకు అన్యాయం.!
- రెండు కేటగిరీలకు సంబంధించి లబ్ధిదారులకు నోటీసులు పంపించాలని ఒత్తిడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

టిడ్కో ఇళ్లల్లో తిరకాసు జరుగుతోంది. ఉచితంగా ఇచ్చే ఇళ్లకు ఎసరు వచ్చింది. ఉచితంగా ఇవ్వడమెందుకు.? అని టిడిపి ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో కొప్పోలు, చింతల రెండు ప్రాంతాల్లో ఏడు బ్లాకుల్లో పేదలకు సంబంధించిన 300 ఎస్ఎఫ్‌టి విస్తీర్ణం కలిగిన 336 ఇళ్లు రద్దు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ చేసి పేదలకు కేటాయించిన ఇళ్లను ఎలా రద్దు చేస్తారనే ప్రశ్నలు కూడా ఇక్కడ ఉత్పన్నమవుతున్నాయి.

చింతల, కొప్పోలు ప్రాంతాలలో గత తెలుగుదేశం ప్రభుత్వం జిప్లస్‌త్రీ పద్ధతిలో ఇళ్ల నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. మూడు కేటగిరీల్లో 6 వేల మందిని అక్కడ లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. అందులో 300 ఎస్ఎఫ్‌టి, 365 ఎస్ఎఫ్‌టి, 430 ఎస్ఎఫ్‌టి లబ్ధిదారులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా 6 వేల మంది లబ్ధిదారుల జాబితాలోంచి 1872 మంది పేర్లను తొలగించారు. అప్పటికి పనులు ప్రారంభం కాని బ్లాకులకు సంబంధించిన లబ్ధిదారులు వీళ్లు. రెండు ప్రాంతాల్లో 4128 ఇళ్లను కట్టాలని నిర్ణయించారు. ఇదే సందర్భంలో 300 ఎస్ఎఫ్‌టి లబ్ధిదారులకు ఉచితంగా ఇళ్లు ఇవ్వాలని వైసిపి ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి రిజిస్ట్రేషన్ కాగితాలను కూడా లబ్ధిదారులకు అందజేసింది. ముందు వారి ▶ 2లో

పెద్ద నాగులవరంలో క్షణక్షణం

- రెచ్చిపోతున్న అధికార పార్టీ గ్రూపు..
- ప్రాణభయంతో సిపిఎం కార్యకర్త 'ఏడుకొండలు'
- కోర్టు ఆదేశించినా కేసు నమోదు చేయని పోలీస్ శాఖ...!
- రాజీకి రావాలని పోలీసుల ఒత్తిడి..!

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వ ఆస్తులంటే... ప్రజలందరి ఆస్తిగా భావించాలి. పెద్ద నాగులవరంను ఆనుకొని ఉన్న.. సామాజిక అవసరాలకు ఉపయోగపడే రూ.కోట్ల ఖరీదైన భూమిని అధికార పార్టీని అడ్డుపెట్టుకొని ఓ వ్యక్తి సొంతం చేసుకోవాలనుకున్నాడు. సిపిఎం కార్యకర్త ఏడుకొండలు ఆ స్థలాన్ని కాపాడే ప్రయత్నం చేశాడు. అధికార పార్టీ అండతో ప్రజా సంపదను దోచుకోవాలనుకున్న వ్యక్తి ఈ పాటికే ఏడుకొండలుకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. అతడి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఈ పాటికే ఏడుకొండలు పోలీసులకు ఫిర్యాదు చేసి ఉన్నారు. కానీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అనే ఆందోళనలో పెద్ద నాగులవరం గ్రామం ఉంది. మార్కాపురం మండలంలోని పెద్ద నాగులవరం గ్రామం ఆనుకొని నివాసాలకు యోగ్యమైన భూమి 12.75 ఎకరాలు సర్వే నెంబరు 173/1ఎలో ఉంది. దానిపై అదే గ్రామానికి చెందిన టిడిపి నేత కన్నుపడింది. దానికి కాజేసేందుకు పథకం రచించారు. ప్రజల ఆస్తి తన్నుకుపోతున్నా అందరూ మనకెందుకులే అనుకున్నారు. సిపిఎం కార్యకర్త ఏడుకొండలు దానిని అడ్డుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. ఎట్టకేలకు ఆక్రమణకు అడ్డుకట్ట వేశాడు. దీన్ని మనసులో పెట్టుకున్న ఆక్రమణదారుడు అదే కుటుంబంలోని మహిళను అతనిపైకి ఉసిగొల్పాడు. అందరూ చూస్తుండగా ఏడుకొండలును ఆ మహిళ చెప్పుతో కొట్టింది. మహిళ కావడంతో ఏడుకొండలు మిన్నకున్నారు. ఈ దాడిని ఓ వ్యక్తి సెల్‌ఫోన్ ద్వారా వీడియోలో బంధించాడు. ఏడుకొండలు అప్పటి నుంచి ఆ గ్రామంలో అవమానంతో జీవనం సాగిస్తున్నాడు. పోలీసులను ఆశ్రయించాడు. దాడి చేసిన వారికి టిడిపి అండగా ఉంది. మార్కాపురం రూరల్ పోలీసులు బాధితుడికి అండగా నిలిచే చర్యలు చేపట్టలేదు. బాధితుడు ఏడుకొండలు దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై కోర్టు కూడా కేసు నమోదు చేయాలని ఆదేశాలిచ్చింది. పోలీస్ ఉన్నతాధికారి కూడా దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. మార్కాపురం రూరల్ పోలీసులు మాత్రం కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నారు. బాధితుడు ఏడుకొండలుపై ఒత్తిడి చేయడం జరుగుతోంది. రాజీకి రావాల్సిందేనని ▶ 2లో

రోడ్డెక్కిన పొగాకు రైతులు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరులో పొగాకు రైతులు రోడ్డెక్కారు. నల్లబర్లీ పొగాకుకి గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నాడు పర్చూరు బొమ్మల సెంటర్లో రైతుసంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎర్ర జెండాలను ఊపుతూ కొద్దిసేపు వాహనాలను ఆపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ జిపిఎ, ఐటీసీ, దక్కన్, మహాలక్ష్మి తదితర పొగాకు కంపెనీలు గతంలో రైతుల వద్దకు వచ్చి ఎక్కువ మొత్తంలో పొగాకుని సాగుచేయాలని చెప్పాయన్నారు. తీరా రైతులు సాగు చేశాక రైతుల ముఖం కూడా చూడటం లేదని చెప్పారు. విదేశీ కంపెనీల నుండి ఎక్కువ మొత్తంలో ఎగుమతి ఆఫర్ ఉందని అప్పుడు చెప్పి.. ఇప్పుడు అంతా సిండికేట్‌గా మారిపోయారని విమర్శించారు. గత సంవత్సరం ధరలకే పొగాకుని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆత్మహత్యే శరణ్యం..

పొగాకుకి గిట్టుబాటు ధర కల్పించకపోతే ఆత్మహత్యే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ చూపించారు కాబట్టే కౌలు రూ.40 వేలు ఉన్నా సాగు చేసినట్లు తెలిపారు. గతంలో ఇదే పొగాకుని క్వింటా రూ.16 వేలకు కొనుగోలు చేశారని, ఇప్పుడు రూ.7 వేలకు కూడా కొనే నాథుడే కరువయ్యాడని వాపోయారు. ధరలు ఇలానే కొనసాగితే రైతులకు ఎకరాకు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పొగాకు రైతులు చేతివత్తుల సంఘం జిల్లా నాయకులు పి.కొండయ్య, సిపిఎం నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, మత్తె డేవిడ్, షేక్ రహీం, రైతులు జూపూడి రోశయ్య, బి చినదాసు, పోతురాజు నాగరాజు, యేసు, బుజ్జి అంకమ్మరావు, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

కట్టావారిపాలెం వద్ద రాస్తారోకో

ఇంకొల్లు: మండలంలోని కొనికి కట్టావారిపాలెం వద్ద నల్లబర్లీ పొగాకు పండించిన రైతులు రాస్తారోకో చేశారు. రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ పొగాకు క్వింటా 15 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా నాయకులు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ గత రెండు, మూడు నెలల నుంచి సమస్యను ప్రభుత్వంతో పాటు అధికారుల దష్టికి తీసుకుపోయినప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు, మంత్రి గొట్టిపాటి దృష్టికి కూడా సమస్యలను తీసుకుపోయామన్నారు. ప్రభుత్వం వెంటనే పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా తక్షణమే చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు.

పూసపాడు అడ్డరోడ్డు వద్ద..

నల్లబర్లీ పొగాకును గిట్టుబాటు ధరకు కొనాలని ఇంకొల్లు మండలం, పూసపాడు అడ్డరోడ్డు వద్ద రైతుసంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ క్వింటా రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభించకపోతే పోరాటాలు విస్తరిస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి షేక్ అహ్మద్, నాయకులు నాగండ్ల వెంకట్రావు, బొగ్గవరపు శంకర్రావు, తన్నీరు గోవిందరాజులు, వంకాయలపాటి మహేష్, పౌలు జకరయ్య, రామారావు, రైతులు పాల్గొన్నారు.

'పెద్ద నాగులవరం'లో క్షణక్షణం

(మొదటిపేజీ తరువాయి)

బెదిరింపులకు దిగుతున్నారు. పోలీసుల తీరు ఈ విధంగా ఉండటంతో పెద్ద నాగులవరం గ్రామంలో దాడి చేసిన టిడిపి కుటుంబీకులు మరింత రెచ్చిపోతున్నారు. 'ఏమైనా చేస్తాం... టైం కోసం వేచి ఉన్నాం' అని హెచ్చరిస్తున్నారు. ఈ విషయం కూడా పోలీసులకు తెలుసు. రక్షణ కల్పించాల్సిన వారు బాధితుడికి సహకరించకపోవడంతో గ్రామంలో తిరిగేందుకు సైతం ఏడుకొండలు భయపడుతున్నాడు. ప్రస్తుతం పెద్ద నాగులవరం నివురు గప్పిన నిప్పులా ఉంది. ఎప్పుడు ఏమి జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటేే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

అంబేద్కర్ చిత్రపటాలు పంపిణీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల: అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ని టిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, కెవిపిఎస్ నాయకులు కందుల రవిలు అన్నారు. మండలంలోని ఇరసలగుండంలో జయంతి వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సభ ఎంపీటీసీ కరేటీ కోటేశ్వరరావు అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం రూపొందించడంలోను, సామాజిక సమానత్వం కోసం అంబేద్కర్ కీలకపాత్ర పోషించారన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని, రిజర్వేషన్ ఫలాలు అందరూ పొందాలన్నారు. అంబేద్కర్ జీవిత విశేషాల గురించి సామాజిక కార్యకర్తలు వి.చంద్రయ్య, కేశవులు, దమ్ము శీను, పి.బాలనరసయ్య వివరించారు. నాయకులు అంబటి సుబ్బారావు, పివి.కొండయ్య, గండూరి బాలచెన్నయ్య, అంబేద్కర్ యూత్ ఫోర్స్, నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. యువకులు అంబేద్కర్ గేయాలను ఆలపించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులు అంబేద్కర్ పాటలతో ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. కాలనీలోనీ 100 కుటుంబాలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలను చంద్రయ్య మిత్రులతో కలిసి పంపిణీ చేశారు.

గ్రామస్థులకు అంబేద్కర్ చిత్రపటాలను పంపిణీ చేస్తున్న చంద్రయ్య

టిడ్కో ఇళ్లలో తిరకాసు.!

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చింది. ఉచిత ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులు రెండు ప్రాంతాల్లో కలిపి 2,544 మంది ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు మాత్రం ముందుకు సాగలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్ల నిర్మాణంలో కదలిక వచ్చింది. పూర్వపు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లు కావడంతో ప్రభుత్వం అందరికీ ఇల్లు కట్టి ఇస్తుందని లబ్ధిదారులు ఆశపడ్డారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కాంట్రాక్టర్లు మారిపోవడంతో కథ కొత్త మలుపు తిరుగుతోంది. ఉచితంగా కట్టి ఇవ్వాల్సిన ఇళ్లకు సంబంధించి చింతలలో నాలుగు బ్లాకులు, కొప్పోలులో మూడు బ్లాకులు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. బ్లాకుకు 48 ఇల్లు చొప్పున 336 ఇల్లు పనులు జరగడం లేదు. ఉచితంగా ఎందుకు ఇల్లు కట్టించాలి.? అనే యోచనతో ప్రభుత్వం ఆ 336 ఇళ్ళను రద్దు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. తద్వారా ప్రభుత్వం కూడా భారాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం. ఉచిత ఇళ్ల నిర్మాణాలు ఈ పాటికే 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. రిజిస్ట్రేషన్ అయిన అందరికీ ఉచితంగా కట్టి ఇవ్వకుండా, ఇప్పుడు ప్రభుత్వం కొత్త మెలికలు పెడుతుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన కనిపిస్తోంది.

ఆ రెండు కేటగిరీల వారికీ నోటీసులు..

300 ఎస్ఎఫ్ టి ఉచిత ఇళ్లను మినహాయిస్తే. మిగిలిన 365, 430 ఎస్ఎఫ్‌టి లబ్ధిదారులు 1,584 మంది ఉన్నారు. వీరిలో 572 మందికి గతంలో బ్యాంకు లోన్లు మంజూరు చేశారు. అయితే వారిలో ఎవరికీ ఇంతవరకు ఇల్లు అప్పగించలేదు. ప్రతినెలా ఈఎంఐ కట్టాలని బ్యాంకు నుంచి సంబంధిత లబ్ధిదారులకు మెసేజ్‌లు, నోటీసులు వెళుతున్నాయి. ఇల్లు అప్పగించకుండా ఈఎంఐ ఎందుకు కట్టాలని లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వారికి అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు. ఇప్పుడు మిగిలిన లబ్ధిదారులు కూడా బ్యాంకు లోన్లు ఇప్పించేలా ఏర్పాట్లు చేయాలని అధికారుల మీద ఒత్తిడి రావడంతో వారు ఏమి చేయలేక అయోమయంలో ఉన్నట్లు సమాచారం.

ఆ నివేదికపైనే చర్చ.!

(మొదటిపేజీ తరువాయి)

కనిపిస్తోందన్న చర్చ కూడా లేకపోలేదు. ఉదాహరణకు మార్కాపురంలో ఇటీవల సిఎం చంద్రబాబు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పనితీరుపై చర్చ వచ్చింది. అయితే ఆ ప్రాంతానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా ప్రభుత్వం నుంచి నెరవేర్చలేదు. దాని ప్రభావం ఎమ్మెల్యేపై పడుతోంది. వెలిగొండ నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వ లేదు. బడ్జెట్‌లోనూ ప్రస్తావనే లేదు. మార్కాపురం జిల్లా హామీ నెరవేర్చలేదు. ఈ రెండు అంశాలు సిఎం చంద్రబాబు స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి. వీటిపై ఇప్పటికీ నాన్చుడు ధోరణి కనిపిస్తోంది. వాటి ప్రభావం పశ్చిమాన ఎమ్మెల్యేల అందరిపైనా పడుతుందని గుర్తించాలి. తూర్పు ప్రాంతంలోనూ అనేక హామీలు ఇచ్చారు. జిల్లా డెయిరీ పునరుద్ధరణతో పాటు నియోజకవర్గాల్లో అండర్‌డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి పథకాలు, ప్రాజెక్టులపై హామీలు ఉన్నాయి. ఇవి ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. వీటి ప్రభావం ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలపై ఉంది. ఇక సహజంగా ఇసుక, రేషన్ బియ్యం, గ్రావెల్, గ్రానైట్ రంగం నుంచి వసూళ్లు వంటివి ఎమ్మెల్యేలపై వీలైనంత త్వరగా అసంతృప్తి రావడానికి కారణాలుగా ఉన్నాయి. ఇవి అన్ని చోట్లా ఉన్నాయి. వైసిపి నేతలకు ఏ మాత్రం తగ్గకుండా కొనసాగిస్తున్నారు. ఏదేమైనా ఇప్పుడు పాలకపక్ష నేతల్లో ఎమ్మెల్యేల పనితీరుపై వచ్చిన సర్వే హాట్‌టాపిక్‌గా మారింది.

CHANGE OF NAME

I, Atla Sireesha, D/o Atla Brahma Reddy, residing at Rajubangarupalem Village, Chinnaganjam Mandal, Prakasam Dt., A.P., I Inform to all that My Daughter previous Name ATLA SIVA TEJASIR REDDY (Old Name) D/o Atla Brahma Reddy, here by declare that I have changed my name as

ATLA SIVATEJASRI REDDY

(New Name)
D/o.Atla Brahma Reddy,.
The Same name continuing in future.

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో

I.A.No. 658/23 in A.S.No. /2023

గంగినేని యోగమ్మ మరియు వగైరాలు ... అప్పిలెంట్స్
వర్సెస్
కొలిశెట్టి రామాంజనేయులు మరియు వగైరాలు ... రెస్పాండెంట్స్

To
R4 గునుపూడి సీతాదేవి,
W/o. నరసింహారావు (లేటు), **R/o Door No.** 32-251/2/2, సాయి నగర్, అద్దంకి టౌన్, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా.

మీకు పై కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన మీకు నోటీసు జారీ నిమిత్తము శ్రీ కోర్టు వారు తే. 08.05.2025 తేదీన ఉదయం 10:30 ని॥లకు పై కోర్టులో స్వయంగా గానీ లేక ఏజెంట్ ద్వారా గానీ హాజరై ఎట్టి ఆక్షేపణలు ఉన్న యడల తెలుపుకొనవలసినది లేని యడల మీ పరోక్షములన తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా: 08.05.2025

స్థలం:దరిశి
తేది:15-04-2025

ఇట్లు :శ్రీ జి.టి. శివశర్మ,
అప్పిలెంట్స్ తరపు అడ్వకేట్,
దరిశి, ప్రకాశం జిల్లా

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు ప్రకాశంజిల్లా, కందుకూరు, కోవూరురోడ్డు, సాయిక్రిష్ణనగర్ డోరునెం. 22-1-52/1 చీదేళ్ళ కొండయ్య గారి కుమారుడు చీదేళ్ళ శ్రీకాంత్ అనువారు నాకు యిచ్చిన సంజాయిషీ మేరకు తెలియజేయుట ఏమనగా నా క్లయింటు తేది. 01-03-2025న ప్రకాశంజిల్లా, ఒంగోలు మండలం, పెళ్లూరు రూరల్, తూర్పు రోడ్డు, డోరునెం. 2-73 ఈమని జాలయ్య గారి కుమారుడు ఈమని శివ అనువారికి తేది. 15.04.2024 న రిజిష్టరు జి.పి.ఎ ద్వారా సంక్రమించిన షెడ్యూలు దాఖలా ఆస్థిని వారి కుటుంబ అవసరముల నిమిత్తం అమ్మచూపగా గది 1కి రూ. 50,000/-లు చొప్పున 52 గదుల 6 చ.అ.లు స్థలమును అమ్మచూపగా నా క్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి తేది. 01.03.2025 న విక్రయ ఖరారు అగ్రిమెంటు వ్రాయించుకొని ఉండియున్నారు. ఈ షెడ్యూలు దాఖలా ఆస్థి గురించి ఎవరికైననూ ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల లోపు నా క్లయింటుకు గాని ఈ దిగువ ఉదహరించిన సెల్ ఫోన్ నెంబరుకు గాని తెలియపరచగలరు.

షెడ్యూలు :

ప్రకాశంజిల్లా, ఒంగోలు సబ్.రి.యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్‌లో ని అన్నవరప్పాడు పోతురాజుపాలెం నందలి, 6వ వార్డు, 6వ బ్లాకు అన్నవరప్పాడు గ్రామ సర్వేనెం. 105 రులోని య. 8-52 సెంట్లులోని య.1-02 సెంట్లులో ఏకప్రదేశముగా ఉండి నీకు విక్రయ ఖరారు పడిన ప్లాటునెం. 184 రులో 416.6/9 చ.గ.లు లేక 52 గదుల 6 చ.అ.లుఖాళీ స్థలమునకు హద్దులు :

తూర్పు : ప్లాటు నెం. 186 రులోని స్థిరాస్థి ఈదిశ 50 అ.లు
దక్షిణం : ప్లాటు నెం. 82 రులోని స్థిరాస్థి ఈ దిశ 75 అ.లు
పడమర : ప్లాను దాఖలా బజారు (30 అడుగుల వెడల్పు) ఈ దిశ 50 అ.లు
ఉత్తరం : ప్లాటు నెం.185 రులోని స్థిరాస్థి ఈ దిశ 75 అ.లు.

తేది.15-04-2025
స్థలము : ఒంగోలు

ఇట్లు
కె. నాగేశ్వరరావు
అడ్వకేటు
సెల్: **9703102929**

జనరల్ నోటీసు ప్రకటన
మహారాజశ్రీ రేపల్లె సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
క్రెడిటర్ I.P.NO. 7/2025

Between:-
మొవ్వా రమేష్ .... పిటిషనర్
మరియు
1. తోట ఉమామహేశ్వరరావు
2. తోట హేమలత
3. గోట్టుముక్కల వెంకటేశ్వరరావు ... రెస్పాండెంట్లు

పై నెంబరు క్రెడిటర్ I.P.పిటీషను రెస్పాండెంట్లు పై దాఖలు చేసి 1, 2 రెస్పాడెంట్లును ఇన్ సాల్వెన్స్ గాను మరియు 1, 2 మరియొకరు 3వ రెస్పాండెంటుకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పిటిషనరు బాకీ ఏగవేయు దురుద్దేశ్యముతో 3వ రెస్పాండెంటు పేర లాలూచిగాను, ప్రతిఫల శూన్యముగాను విక్రయ దస్తావేజును సృష్టింపునకు తెచ్చి ఉన్నందున అందు విషయమై సదరు విక్రయ దస్తావేజును రద్దు చేయమని కోరుచు పై నెంబరున పై కోర్టులో క్రెడిటర్ I.P. No. 7/2025 న పిటిషన్ దాఖలు చేయగా ఎవరికైనను ఎట్టి అక్షేపణలు ఉన్న యెడల ది. 22-04-2025న వాయిదా తేదిన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30ని.లకు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ, హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకొన వచ్చునని యిందు మూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియ చేయటమైనది. లేని యెడల పిటీషనును వాయిదా తేదిన పరోక్షమున తీర్మానించెదరు.

వాయిదా తేది : 22-04-2025.

షెడ్యూలు

బాపట్ల జిల్లా, రేపల్లె సబ్ డి.యిలాకా రేపల్లె మున్సిపల్ డోర్ నెం.3-5-61. రేపల్లె గ్రామ డి.నెం.187కు గాను రేపల్లె మున్సిపల్ టౌన్ సర్వేయర్ గారి సర్వే ప్రకారం ఆ మేరకు శ్రీ రేపల్లె మున్సిపల్ కమీషనర్ గారు ఆర్.ఓ.సి.నెం. 789/2024 జీ1 ది. 28-11-2024 జారీ చేసిన ఎండార్స్ మెంట్ ప్రకారం సదరు ఆస్తి రేపల్లె గ్రామ డి.నెం. 187/10న చ.గ.61లు అందలి 1,2 రెస్పాడెంట్లుకు హక్కు కలిగిన Ass No.10260 00755 గల చ.గ.61లు స్థలము మరియు రేకుల కప్పు గల ఇల్లు మరియు సదరు ఇంటికి సంబంధించిన యావత్ విశిష్ట కలప సామానులు కరెంట్ మీటరు నెం. 14869 వగైరాలతో సహా.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము //

స్థలము : రేపల్లె
తేదీ: 11-04-2025.

గుజ్జర్లమూడి ప్రశాంత కుమార్
పిటీషనర్ తరపున
న్యాయవాది

మహారాజశ్రీ అడిషనల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఈ.ఎ. నెం. 109/23 ఇన్ ఇ.పి. నెం. 144/16 ఇన్ ఓ.యస్.నెం. 10/2014

బిట్వీన్:
ఇండ్లమూరి కృష్ణమూర్తి ... డిహెచ్ఆర్
వర్సెస్
పిల్లి బాబురావు .... జెడిఆర్

టు,
పిల్లి బాబురావు, తండ్రి : ఫిలిప్, తాడిగిరిపాడు, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు ఇ.పి.లోని ఈ.ఏ. 109/23లో మీకు శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 28-4-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 28-4-2025

ఇట్లు
మాదినేని రామ్‌ప్రసాద్,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది,
తెనాలి. సెల్ : 9246469955

పిల్లలను బడిలో చేర్పించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించి ఎంపిడిఒ వై.మహలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంఇఒలు, ఐసిడిఎస్, ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్, డిజటల్ అసిస్టెంటుఉల, మహిళా పోలీసు సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. బంగారు బాల్యంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బడిమాని వేసిన పిల్లలను గుర్తించి నూరు శాతం పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతానికి కషి చేయాలన్నారు. పిల్లల నమోదు కార్యక్రమాన్ని ఈనెల 23 వరకు చేపట్టాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లోని ఐదు సంవత్సరాలు వారిని ప్రభత్వపాఠశాల్లో చేర్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఇలు టి.రవి ,ఇవి. రమణయ్య , సూపరింఇండెంట్ దక్షిణామూర్తి, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు ఉషా ,శ్రీదేవి, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డిజల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న ఎంపిడిఒ మహాలక్ష్మి

కొండపి : డ్రాప్ అవుట్ విద్యార్థులను, ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంపిడిఒ రామాంజనేయులు తెలిపారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా స్పెషల్ ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలను గురించి వారిని పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 రామారావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ విక్టోరియా రాణి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, యూపీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయ పరిధిలోని ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీకృష్ణ

కొత్తపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బంగారు బాల్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీకృష్ణ మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిం చాలన్నారు. 1 నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులను పైతరగతి ప్రమోట్ చేయాలన్నారు. సిఆర్‌పిలు ఒక్కొక్కరూ పది పాఠశాలలను ఎంపిక చేసుకొని ఆ పాఠశాలలలో ఆధార్ కార్డులు లేని విద్యార్థులను గుర్తించాలన్నారు. సమచారాన్ని విద్యాశాఖ అధికారులకు అందజేయాలన్నారు. ఆధార్ కార్డులు, పుట్టిన తేది సర్టిఫికెట్ లేని వారికి వెంటనే ఇప్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వేణు, ఎంఇఒలు తులసి, పద్మావతి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ అనురాధ పాల్గొన్నారు.

పొన్నలూరు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రధానో పాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుజాత మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకూ సెష్పల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు రవిచంద్రబాబు, టి.హరిబాబు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ రమాదేవి, వివిధ పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు : బంగారు బాల్యం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జరుగుమల్లి ఎంపిడిఒ ఎంవి. రమణమూర్తి తెలిపారు. జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరుగుమల్లి ఎంఇఒ నాగేంద్రవదన్ అధ్యక్షతన ప్రధానోపా ధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని 5 సంవత్సరాలు నిండిన విద్యార్థులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు జ్యోతి, భారతి సిఆర్‌ఎంటిలు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన సుభాని

డివైడర్‌ను ఢీకొన్న బైకు.. యువకుడు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

బైకు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శింగరాయకొండ మండల పరిధిలోని కలికివాయి-కనుమళ్ల మధ్య ఉన్న పోలేరమ్మ గుడి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో యద్దనపూడి మండలం పెద జాగర్లమూడి గ్రామానికి చెందిన మహబూబ్ సుభాని (33) మృతిచెందాడు. మృతుడు గూడూరులోని ఓ హోటల్ పని చేస్తున్నాడు. పనుల నిమ్మిత్తం ఇంటికి వచ్చి తిరిగి గూడూరు వెళ్తున్న క్రమంలో రహదారిపై ఉన్న డివైడర్ కనిపించక పోడంతో బైకు ఢీ కొంది. దీంతో సుభానికి తీవ్ర గాయలయ్యాయి. క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుభాని మృతిచెందాడు. శింగరాయకొండ ఎఎస్ఐ షేక్ మహబూబ్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

డీజిల్ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - టంగులూరు

డీజిల్ చోరీ కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... టంగుటూరు, తూర్పు నాయుడు పాలెం లారీ యూనియన్ ఆఫీస్‌ల వద్ద ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ చోరీకి పాల్పడ్డారు. ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సింగరాయకొండ సిఐ సిహెచ్.హాజరత్తయ్య పర్యవేక్షణలో టంగుటూరు ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు తన సిబ్బంది కలిసి కేసు దర్యాప్తును ప్రారంభించారు. పలనాడు జిల్లా, బొల్లాపల్లి మండలం, కేశవారిపేట తండాకు చెందిన మెరజోత్ చిన్న హున్యా నాయక్, మెరజోత్ హున నాయక్ నిందితులుగా గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 220 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే చోరీ

- రూ. రెండు లక్షల నగదు
- ఏడు తులాల బంగారం అహరణ

ప్రజాశక్తి- కంభం

పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. ఈ ఘటన మండల పరిధిలోని పోరుమామిళ్ళపల్లె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారాబత్తుని చంద్ర శేఖర్ మంగళవారం ఉదయం పిల్లలను స్కూల్ దించడానికి వెళ్లాడు. అతని భార్యా ఇంటికి తాళం వేసి సరుకులు తెచ్చుకొనేందుకు గిద్దలూరులోని మిలటరీ క్యాంటీన్ వెళ్లింది. మధ్యాహ్న సంయలో చంద్రశేఖర్ ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం తీసి ఉంది. మంచం దుస్తులు, ఇతర వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. అనుమానంతో చంద్రశేఖర్ కబోర్డు పరిశీలించగా అందులో దాచిన రూ.రెండు లక్షల నగదు, ఏడు తులాల బంగారు ఆభరణాలు, 300 గ్రాముల విలువైన వెండి వస్తువులు కనినిపంచలేదు. దీంతో చంద్రశేఖర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీం ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి- టంగుటూరు

స్థానిక రైజ్ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు మిరాకెల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. వైజాక్‌కు చెందిన మిరాకెల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైజ్ కళాశాలలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులను రెండవ రౌండ్‌కు ఎంపిక చేశారు. అనంతరం టెక్నికల్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చివరగా హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించారు. ఫైనల్‌గా ఏడుగురు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.3,40,000 వార్షిక వేనతం ఉంటుందని కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు, గౌవర చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, కళాశాల ప్లేస్ మెంట్ అధికారి రఘు బాబు, చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, డైరెక్టర్ డాక్టర్ ఎవి. భాస్కరరావు, ప్రిన్సిపల్ కెవి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-పొన్నలూరు

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు అర్హులైన వారు వచ్చేనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ డాక్టర్ సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఎస్‌సి అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె పేర్కొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది ర్యాలీ

ప్రజాశక్తి-టంగుటూరు

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలు, నివారణ చర్యలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపం కేంద్రం అధికారి ఎ. రమణారెడ్డి, లీడింగ్ ఫైర్‌మెన్ బి.సత్యన్నారాయణ, బి. పాల్‌బర్న, టి. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

కొండపి: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బస్టాండ్ ప్రాంగణంలోని ప్రయాణికులకు అగ్నిమాపకకేంద్ర అధికారి సిహెచ్.వెంకటరావు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-టంగుటూరు :

స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం మూడో సంవత్సరం విద్యార్థులకు వెబ్ డెవలప్‌మెంట్ విత్ డిజంగోపై నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కె.శివ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివ సుబ్బారావు ప్రస్తుతం యంగ్‌మైండ్ టెక్నాలజీస్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో పైతాన్ డెవలప్‌ర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజంగో అనేది వేగవంతమైన అభివృద్ధి భద్రత,స్కేలబిలిటికి ప్రాధాన్యమిచ్చే ఉన్నత స్థాయి పైతాన్ వెబ్ ఫ్రమ్ వర్కు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జివికె.మూర్తి, డీన్ అకడమిక్స్ డాక్టర్ సివి.సుబ్బారావు, డీన్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్‌జ వీరాంజనేయులు, డీన్ ట్రయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ రూపఅక్కేష్, కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. గిరిబాబు, కో ఆర్డినేటర్ సునీత పాల్గొన్నారు.

ప్రింటర్ అందజేస్తున్న వేమా శ్రీనివాసరావు

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని కెవి.పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వేమా ఆంజనేయ ప్రసాద్ జ్ఞాపకార్థం రూ.14,000 విలువైన ప్రింటర్‌ను మంగళవారం బహూకరించారు. జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు ఎన్.పీరుసాహెబ్, ఉపాధ్యాయులకు ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సోదరుడు వేమ ఆంజనేయ ప్రసాద్ జ్ఞాపకార్థం వారి కుమార్తెలు రజిని కుమారి, రమాదేవి, కళ్యాణి రాధ ప్రింటర్‌ను సమకూర్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వేమా శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ఏలూరిని కలిసిన కొత్తపాలెం సర్పంచి, గ్రామస్థులు

కొత్తపాలెం అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

కొత్తపాలెం గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. ఇసుకదర్శిలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పాలపర్తి బూసిరెడ్డి, కొమరగిరి చెంచయ్యతో పాటు పలువురు గ్రామస్తులు ఆయనను మంగళవారం మర్యాద పూర్వం కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామంలో సమస్యలను దశలవారిగా పరిష్కరించాలని అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కొత్తపాలెం గ్రామ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. గ్రామంలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడతామని అన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

స్టాల్స్ పరిశీలిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

ఆకట్టుకున్న పౌష్టికాహార స్టాల్

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని చుండూరు ఆదిశేషమ్మ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి నిర్మాణ పనులను శాసన సభ్యులు ఎంఎం కొండయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ అందరినీ ఆకట్టుకుంది. 7వ పౌష్టికాహార పక్షోత్సవంలో ఆయన పాల్గొని అన్నప్రాసనం, సీమంతాలు చేశారు. వెయ్యి రోజుల కార్యక్రమాన్ని ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కలిగించారు. స్టాల్ ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్, సిడిపిఓ టి ఝాన్సీ, తహశీల్దారు పి పార్వతి, ఎంపిడిఒ మెడబలిమి రాజేష్, ఎంఈఓ జెవి సుబ్బయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సజ్జ పుష్పవల్లి, లీలావతి, కుమ్ముద్వతి, శేషమ్మ, కవిత, ప్రసన్న, తబిత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య

వేటపాలెం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వేటపాలెం

మండల కేంద్రమైన వేటపాలెం పంచాయితీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. తనతో పాటు తనయుడు మహేంద్ర నాథ్ స్థానిక పంచాయతీ కార్యాలయంలో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి దశల వారిగా కృషి చేస్తానని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. సమావేశంలో తహశీల్దారు, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, ఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధనరావు, పొగడదండ రవికుమార్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు

బ్యాంకర్లను కోరిన కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల్లో సబ్సిడీ రుణాలు అందించాలని నిర్ణయించిన నేపథ్యంలో బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ఎస్సిల అభ్యున్నతికి సహకారం అందించాలని బ్యాంకర్లను కోరారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎస్సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సి యాక్షన్ ప్లాన్ 2025-26లో ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం అమలుపై మంగళవారం ప్రత్యేక సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మొత్తం రూ.54.60 కోట్లతో జిల్లాకు 1,305 యూనిట్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో రూ.21.58 కోట్లు సబ్సిడీ కాగా రూ.30.29 కోట్లు బ్యాంకు రుణమని, మిగిలిన మొత్తం లబ్దిదారులు కట్టాల్సి ఉంటుందన్నారు. బ్యాంకు, బ్రాంచ్, మండలాల వారీగా రుణ లక్ష్యాలు నిర్దేశించామని అన్నారు. ఎస్సి యాక్షన్ ప్లాన్

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రక్రియ పూర్తి చేయడానికి కాల పరిమితి నిర్ధేశించామని అన్నారు. అర్హత కలిగిన ఎస్సి లబ్దిదారులకు రుణాలు మంజూరు చేస్తూ బ్యాంకులకు కేటాయించిన రుణాల మంజూరు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 14 నుంచి మే 13 వరకు నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. సమావేశంలో ఎస్సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఎల్‌డిఎం రమేష్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోండి

స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసిన కలెక్టర్ తమివమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అవకాశాలు అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతూ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన బాలికలకు మలబార్ చారిటబుల్ ట్రస్ట్ తరపున మంగళవారం స్థానిక ఎకె, వికె జూనియర్ కాలేజీలో జరిగిన స్కాలర్‌షిప్‌ల పంపిణీలో ఆమె మాట్లాడుతూ మౌళిక వసతులు కల్పిస్తూ ప్రతిభ కలిగిన భోధనా సిబ్బంది ద్వారా ఉత్తమ ఫలితాలు రాబట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. వాటి ఫలితంగానే ఇంటర్మీడియట్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని అన్నారు. కేవలం విద్యాపరమైన విషయాలే కాకుండా కమ్యునికేషన్ స్కిల్స్ ఎంచుకోవడంతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లోనూ నైపుణ్యం సాధించాలని అన్నారు. తానూ స్కూల్ వయస్సులోనే కలెక్టర్ కావాలని నిర్ణయించుకున్నాననీ, అప్పటి నుంచే ఆ దిశగా అడుగులు వేశానని వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా మద్దిపాడు, సింగరాయకొండ, టంగుటూరు, కొండపి, ఉప్పుగుండూరు, చీమకుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని 68 మంది బాలికలకు సిఎస్ ఆర్ నిధులతో రూ.5.66

స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

లక్షల విలువైన చెక్కులను అందించారు. ఒంగోలు మలబార్ గోల్డ్ స్టోర్ హెడ్ శామ్యూల్ మాట్లాడుతూ చారిటిలో 5శాతం సిఎస్ఆర్ నిధులను ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిభగల బాలికలకు ప్రోత్సాహక స్కాలర్షిప్పులు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1928 మంది బాలికలకు రూ.1.67 కోట్లను ఇస్తున్నట్లు తెలిపారు. 'ఎంపవరింగ్ ఎడ్యుకేషన్ ఎంపవరింగ్ మదర్ హుడ్' ఇతివృత్తంతో చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐఒ సైమన్ విక్టర్, ఏకెవికె కళాశాల ప్రిన్సిపల్ రామిరెడ్డి, మలబార్ గోల్డ్ మేనేజర్ గోపి, జమీర్ పాల్గొన్నారు.

చదువుకోవడం ద్వారానే ఉన్నత భవిష్యత్తు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా అద్దేపల్లి అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పి మనోజ్ కుమార్ అధ్యక్షత వహించారు. సభలో ఎంఈఓ నేల దేవరాజ్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను స్మరించుకోవడం అంటే బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదాలను ముందుకు తీసుకు వెళ్లడమేనని అన్నారు. ఎస్ఐ శివయ్య మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కుల వివక్షత, అంటరానితనాన్ని ఎదుర్కొని ఉన్నత విద్య అభ్యసించి దేశానికి రాజ్యాంగాన్ని రాశారని గుర్తు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటర్మీడియట్, పదో తరగతి

బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ, ఎంఈఓ

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, ముగ్గులు, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మద్దిరాల ఆనందరావు, కసుకుర్తి భాస్కర్, దాసరి కిరణ్, అంబేద్కర్ యూత్ సభ్యులు అమ్రేష్, ప్రదీప్, ఆనంద్, ప్రకాష్, బాబి, విన్సీ బాబు, రాజేష్, రాంబాబు పాల్గొన్నారు.

ముగిసిన వృత్తి విద్య శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పంగులూరు

వృత్తి శిక్షణలో భాగంగా 10వ తరగతి పూర్తి చేసిన 81మంది విద్యార్థులకు శిక్షణ పూర్తయినట్లు కొండమంజులూరు పీఎంశ్రీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇమ్మడిశెట్టి అనిత తెలిపారు. 12 రోజుల ఇంటర్న్ షిప్ ఏప్రిల్ 4న ప్రారంభించి ఏప్రిల్ 15కు పూర్తి చేశామని తెలిపారు. ఎస్ఎస్ఎ ఉత్తర్వులతో ఇటర్న్‌షిప్ శిక్షణ నిర్వహించామని తెలిపారు. రిటైలింగ్ ట్రేడ్‌కు గైడ్‌గా ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ గంగా ప్రసాద్, ఆటోమోటివ్ ట్రేడ్‌కు గైడ్‌గా ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ బాలాజీ నాయక్ వ్యవహరించారని తెలిపారు. అద్దంకిలోని వివిధ దుకాణాల్లో, ఆటోమోటివ్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్‌ను మార్టూరులోని ఆటోమొబైల్ షోరూమ్స్‌లో చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు ఎస్ఎస్ఎ ద్వారా సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు.

కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కార్మికులను నియమించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు పంచాయతీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించి రోడ్ల వెంబడి చెత్త నిల్వ లేకుండా చూడాలని, పూడిపోయిన మురుగు కాలువలు తీయాలని పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావుకు సిపిఎం నాయకులు మురుగుడు సత్య నారాయణ, పి మనోజ్ కుమార్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిందని, అది మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో ఉండే విధంగా చూడాలని కోరారు. పంచాయతీలో పారిశుద్య నిర్వహణకు తీసుకున్న కార్మికులను ఇతర పనులకు కేటాయించడంతో ఉన్న కొద్దిమంది కార్మికులపై పరిభారం పెరిగిందని అన్నారు. వారానికి ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే రోడ్లు శుభ్రం చేసే పరిస్థితి పంచాయతీలో నెలకొందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా విస్మరించారని అన్నారు. ఇప్పటికైనా జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచి ప్రతి వార్డును శుభ్రంగా ఉంచే విధంగా చూడాలని కోరారు.

కలెక్టర్ అన్సారియాకు బొకే అందజేస్తున్న ఇందిరాదేవి

డిసిఒగా ఇందిరా దేవి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా సహకార అధికారిగా ఎన్ ఇందిరా దేవి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసి) మంగళవారం చేపట్టారు. జిల్లా సహకార అధికారిగా పనిచేసిన శ్రీనివాసరెడ్డిపై ఆరోపణలు రావటంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వానికి సరెండర్ చేశారు. డిప్యూటీ రిజిస్టర్‌గా ఉన్న ఎన్ ఇందిరా దేవిని జిల్లా సహకార అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. డిసిఒ ఇందిరా దేవికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న సిఇఒ ఉమామహేశ్వరరావు

ఎన్నారై కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

గ్రామీణ ప్రాంత విద్యార్థులతో అత్యుత్తమ ఫలితాలు సాధించామని ఎన్ఆర్ఐ కళాశాల సీఈఓ ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక గుల్లపల్లిలోని ఎన్ఆర్‌పై జూనియర్ కళాశాల ఆవరణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. సాధారణ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందించే ఉద్దేశంతో చెరుకుపల్లి ఎన్ఆర్ఐ కళాశాల బ్రాంచి ప్రారంభించామని, అనతి కాలంలోనే అత్యుత్తమ ప్రతిభ చాటారని అన్నారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్లో ముగ్గురు విద్యార్థులు 465 మార్కులు సాధించగా, నలుగురు విద్యార్థులు 464 మార్కులు సాధించడం ఈ ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. బైపిసి విభాగంలో 433 మార్కులు విద్యార్థులు సాధించాలని తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 981 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనపర్చారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల డీన్ శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కారుణ్య నియామకాలు చేపట్టాలని..

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మున్సిపల్ వర్కర్ల కారుణ్య నియమకాలు చేపట్టాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు)డిమాండ్ చేసింది. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ వర్కర్లుగా పనిచేస్తూ మరణించిన వారు, 60 ఏళ్ళ పేరున తొలగించిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. టి.విజయమ్మ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు గడుస్తున్నప్పటికీ మున్సిపల్ వర్కర్ల హామీలు అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.మున్సిపల్ రెగ్యులర్ ఉద్యోగులకు వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచుతూ మున్సిపల్ కార్మికులకు (అప్కాస్, కాంటాక్ట్) 60 సంవత్సరాలకు రిటైర్మెంట్ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. పారిశుధ్యకార్మికులు దేవుళ్లఅని, వారిసేవలు మరెవరూ చేయలేరని చెబుతూనే 60 ఏళ్లకు వారికి ఇంటికి పంపడం, అప్కాస్ రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగించే చర్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 30ఏళ్ల పాటు సేవలందించిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయకుండా ఒట్టి చేతులతో ఇంటికి పంపడం సరికాదన్నారు. గత ప్రభుత్వం మరణించినవారు, తొలగించిన వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకుంటానని రాతపూర్వకం ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కారుణ్య నియామకాలతో పాటు తొలగించిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జి. నరసింహం, నాయకులు రత్నకుమారి, బి.రామారావు, నాగేశ్వరరావు, వంశీ, సురేష్, జి. శ్రీను,బి.రామయ్య, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

దుస్తులు అందజేస్తున్న సర్పంచి వనజ

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి దుస్తులు, నిత్యావసర సరుకులు, పాదరక్షలు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచి తాటిపర్తి వనజ అధ్యక్షతన వార్డు సభ్యుల ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ మరియు పరిశుభ్రతలో కార్మికుల పనితీరు గొప్పదని తెలిపారు. వారిని గౌరవించాల్సిన అవరసం ఉందన్నారు. కార్మికుల జీతాలు పెంచేందుకు సిద్ధంగా ఉన్నటుల తెలిపారు. ఈ పాటికే వార్డు సభ్యుల సహకారంతో తీర్మానం చేసినట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులకు ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. జీతాల పెంపు విషయం గురించి అధికారులతో మాట్లాడి త్వరలో జీతాలు పెంచి విధంగా చూస్తామని తెలిపారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల జీతాల విషయం గురించి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడించి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు పడిదపు రవి కుమార్, మేకల నరేష్‌బాబు, ఓలేటి రవిశంకర్‌రెడ్డి, తన్నీరు తిరుపతమ్మ, షేక్ షాకీరా, షేక్.ముజీబ్, పంచాయతీ కార్యదర్శి ఎన్.జగదీష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ జె.శ్రీనివాసులు, బిల్ కలెక్టర్ శ్రీనివాసులు, నక్కా మాల్యాద్రి, సతీష్, అశోక్, లక్ష్మణ్, ప్రణయ్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దారి పరిశీలన

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని నాగన్నపాలెం గ్రామంలో ఎస్‌సిల శ్మశాన వాటిక వెళ్లే దారిని అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా నాగన్నపాలెం ఎస్‌సి కాలనీ వాసులు శ్మశాన వాటిక వెళ్లేందుకు దారి లేదని, దీంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు సిపిఎం బృందం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సిపిఎం నాయకులు ఇటీవల తహశీల్దారు సుజన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తహశీల్దారు ఆదేశాల మేరకు విఆర్‌ఒలు శ్మశాన వాటిక వెళ్లే రహదారి స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పి.శ్రీనాథ్

20న నీట్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

డివైఎఫ్ఐ ఆధ్వరంలో ఈనెల 20న నీట్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ నాయకులు ప్రకటించారు. మెడిక్యూర్ మల్టీ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌లో మోడల్ పరీక్షకు సంబంధించినపోస్టర్ ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.శ్రీనాథ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువత సంక్షేమంతో పాటు సమాజ శ్రేయస్సుకు కృషి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యువజన సమస్యలకోసం, నిరుద్యోగుల సమస్యలపై ఉద్యమాలు చేపట్టం అభినందనీయమన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు మాట్లాడుతూ యువతీ, యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతంఆందోళన, పోరాటాలు నిర్వమిస్తున్నటుల తెలిపారు. వేసవిలో చలివేంద్రాలు, బాలలకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షకు ప్రిపేరయ్యే వారికి,పబ్లిక్ పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టడానికి మెడల్ పరీక్షతెలిపారు.ఈ నెల 20న మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకూ మోడల్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడల్ టెస్టు 1,2,3, ర్యాంకులు సాధించిన వారిని ప్రోత్సహించేందుకు అభినందన సభలో బహమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు టి.భాను, బి. హేమంత్, టి. సుశాంత్, ఎస్‌కె. హిదాయత్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు

పౌష్టికాహారం తీసుకోవాలి : సిడిపిఒ

ప్రజాశక్తి-కొండపి

మాట్లాడుతున్న సిపిడిఒ మాధవీలత

ప్రతి ఒక్కరూ పౌష్టి కాహారాన్ని తీసుకోవాలని సిడిపిఒ మాధవీలత తెలిపారు. పోషణ్ పక్వాడ వారోత్స వాలలో భాగంగా స్థానిక దాసరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ పౌష్టికాహారం ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి దోహద పడుతుందన్నారు. కౌమార దశలోని బాలికలు, గర్భిణులు, బాలిం తలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ విక్టోరియా రాణి, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు పాల్గొన్నారు.

మద్దిపాడు : చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపిడిఒ ప్రసాద్ తెలిపారు. పోషణ పక్వాడ కార్యక్ర మంలో అంగన్‌వాడీలకు ఆరోగ్యకరమైన తినుబండారాలను తయారీ, వాటిని నిల్వ చేసే విధానంపై మంగళవారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చిన్నారులకు రుచికరమైన పదార్థాలు పెడితే వారు అంగవాడీ కేంద్రాలకు వస్తారని తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితులు గమనిస్తూ సంపూర్ణ పోషణ అందిం చాలన్నారు. ఎంఇఒలు ఆంజనేయులు, మెడబలిమి శ్రీనివాస రావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ కేంద్రాల్లోని పిల్లలను ప్రాథమిక పాఠశాలలలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దారు సుజన్ కుమార్, ఎపిఎం సుబ్బారావు, సిహెచ్ లలితమ్మ, ఐసిడీఎస్ సూపర్ వైజర్లు జయలక్ష్మి నాగరాజ, పద్మావతి, అంగన్‌వాడీలు, వెల్ఫేర్అసిస్టెంట్లు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

జయకుమార్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-శింగరాయకొండ

అవార్డు అందుకుంటున్న జాయకుమార్

శింగరాయకొండకు చెందిన సాంత్వనాసేవా సమితి డైరెక్టర్ రావినూతల జయ కుమార్‌కు అంబేద్కర్ జాతీయ సేవా రత్న అవార్డు దక్కింది. సేవా కార్యక్రమాలు, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలల వెట్టి చాకిరి నిర్మూలన, బాల కార్మికుల వ్యవస్థ, బంగారు బాల్యం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినందుకు గానూ జయకుమార్ ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. రాజమండ్రిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయవాది, తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్స్ జెఎసి నాయకులు ఆదిలక్ష్మి, ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయవాది మరియు రాష్ట్ర ఎన్‌జిఒల సంఘం అధ్యక్షురాలు డాక్టర్.లక్ష్మీ చేతుల మీదుగా జయకుమార్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జయకుమార్.మాట్లాడుతూ కలెక్టర్ తమీమ్ అన్సారీయా ప్రారంభించిన బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలల వెట్టి చాకిరి నిర్మూలన, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసినందుకు గానూ తనకు ఈ అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

'శిద్దా' దంపతులకు ప్రముఖుల ఆశీర్వాదం

ప్రజాశక్తి -చీమకుర్తి

కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, పారిశ్రామికవేత్త శిద్దా హనుమంతరావు పుష్పలత దంపతుల షష్టిపూర్తి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొని శిద్దా హనుమంతరావు దంపతులను ఆశీర్వాదించారు. శిద్దా దంపతులను ఆశ్వీరదించిన వారిలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు దంపతులు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ శిద్దా సుధీర్ దంపతులు, మన్యం సునీత, రాజశేఖర్ అర్చన దంపతులు, నల్లూరి ఫౌండేషన్ అధినేత నల్లూరి వెంకట శేషయ్య, పారిశ్రామికవేత్తలు బంగారు రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, కంది రవిశంకర్, చలువాది బదరీ నారాయణ, డాక్టర్ జవహర్, హరి ప్రసాద్, రామచంద్రా రెడ్డి, శిద్దా వెంకటేశ్వరరావు దంపతులు, శిద్దా సూర్య ప్రకాష్ రావు దంపతులు, శిద్దా భరత్ దంపతులు, ఉదయ్ దంపతులు, మురళీమోహన్‌రావు, కమలాకర్, ప్రకాష్ ఆర్ట్స్ అధినేత సుబ్బారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్తు శేఖర్, బాలాజీ రావు, భాస్కర్ రెడ్డి, ఉపాస్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రకాష్, గుప్తా కన్స్ట్రక్షన్స్ అధినేత వీరబాబు, రైస్ కళాశాల గౌరవ చైర్మన్ రంగమన్నార్ ఉన్నారు.

శిద్దా హనుమంతరావు దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

శిద్దా హనుమంతరావు దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రభుత్వ నివాస గృహాలు తనిఖీ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని చల్లారెడ్డి పాలెం పంచాయితీ నాయునిపల్లి రెవిన్యూ గ్రామంలో ప్రభుత్వ నివాసాల గృహాలు తనిఖీ చేసినట్లు తహాశీల్దారు పి పార్వతి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాయనపల్లి రెవెన్యూ గ్రామం దత్తక్షేత్రం, కొంజేటి చేనేతపురి కాలనీల్లో బుధవారం నుండి తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు. ఈ తనిఖీలకు విఆర్ఒలు, సర్వేర్లను 13 బృందాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్వే ఉడత శ్రీనివాసరావు, డిటి దాసరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

తహాశీల్దారు పార్వతి

చెరుకుపల్లి : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మనమిత్ర కార్యక్రమం అవగాహన కల్పించేందుకు నేటి నుండి సచివాలయ సిబ్బందిచే ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తారని ఎంపిడిఒ షేక్ మహబూబ్ స్వామి తెలిపారు. ఇంటి వద్ద నుండే మొబైల్ ద్వారా మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలు ప్రజలకు ఉపయోగ పడతాయని తెలిపారు. వివిధ రకాల సర్టిఫికెట్లు, దేవాలయాల టికెట్లు, బస్ టికెట్లు బుకింగ్, అనేక రకాలైన సేవలు అందుతాయని తెలిపారు.

వడలిని సన్మానిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉగాది పురస్కార గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక దేవాంగపురిలోని గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం 65 మంది పేదలకు బట్ట మోహనరావు, పుష్పల్లీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ మిలటరీ అధికారి బట్ట శంకరరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు దుప్పట్ల పంపిణీ, అన్నదానం, ఆర్థిక సహాయం చేశారు. రాష్ట్ర ఉగాది పురస్కార గ్రహీత వడలి రాధాకృష్ణకు ట్రస్ట్ తరపున వేద ఆశీర్వచనంతో ఘనంగా సన్మానించారు. వేటపాలెం పట్ట బద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ నిరుపేదలకు ఐదేళ్లుగా మంగళ, శని వారాలు అన్నదానం చేయటం అభినందనీయమని అన్నారు. తెలుగు సాహితీ రంగంలో వినూత్నమైన రీతిలో రచనలు చేసి అవార్డులు అందుకున్న వడలి రాధాకృష్ణకు సన్మానం చేయటం ఎంతో ముదావహమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బట్ట మోహనరావు, ఉగాది పురస్కార అవార్డు గ్రహీత వడలి రాధాకృష్ణ, పుట్టంరాజు సీతారామయ్య, గుత్తి పరంజ్యోతి, సత్రం రోహిణి కుమార్, సత్రం రోహిణి కుమార్, బండారు రాజేష్, విశ్వనాథ్ శాస్త్రి, సజ్జ వీర రాఘవ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పంగులూరు

మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన పూసపాటి శివశంకర్ మొక్కజొన్న లోడుతో ట్రాక్టర్ వెళ్లి రాత్రి కోటపాడు వస్తుంది. అదే ట్రాక్టర్లో కోటపాడు గ్రామానికి చెందిన గొల్లమూడి అంజయ్య (50) ఉన్నాడు. అంజయ్య ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్నట్లు తెలుస్తుంది. ట్రాక్టరు ముప్పవరం నుంచి కోటపాడు వచ్చే రూట్లో ఆదిరెడ్డి బావి దగ్గర మలుపు తిరుగుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి ఒకసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్‌పై ఉన్న గొల్లమూడి అంజయ్య కింద పడిపోయాడు. క్రిందబడ్డ అంజయ్యపై ట్రాక్టర్ వెనుక చక్రం పోవడంతో అంజయ్య అక్కడికక్కడే మరణించాడు. మరణించిన అంజయ్యకు భార్య వెంకాయమ్మ, కుమారులు మరియబాబు, వెంకటేష్ ఉన్నారు. అంజయ్య మృతి విషయం తెలుసుకున్న కోటపాడు ఎస్సీ కాలనీ వాసులంతా సంఘటన స్థలానికి చేరుకున్నారు.

వలస కార్మికులకు వైద్య సేవలందించండి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వలస కార్మికుల వివరాలు తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ

పనుల కోసం వలస వచ్చిన కార్మికులకు ఆరోగ్య సేవలు సకాలంలో అందించాలని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు వైద్య సిబ్బందిని ఆదేశించారు. కొత్తపట్నం పిహెచ్‌సిలోని ఆలూరు ఆర్ఆర్ కాలనీకి ఇటీవల వలసపై వచ్చిన కార్మికులను ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వలస కార్మికులకు ఆరోగ్య పరంగా అందవలసిన వైద్య సేవలు సకాలంలో అందించాలని పిహెచ్‌సి వైద్యాధికారిణిని అదేశించారు. ఆర్ఆర్ కాలనీలోని వలస కార్మికులకు మధుమేహం, రక్తపోటు, హెచ్‌బి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకేంద్ర సిబ్బంది ద్వారా అవసరమైన మందులు సరఫరా చేయాలన్నారు. ఆధార్ కార్డు లేని వలస కార్మికులకు సంబంధిత సచివాలయ సిబ్బందితో మాట్లాడి ఆధార్ కార్డ్ ఇప్పించాలని ఆదేశించారు. వారి ఆరోగ్య పర్యవేక్షణకు ఉప కేంద్ర పరిధిలోని నెఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌సి, ఆశలను ఆదేశించారు. కాలానుగుణంగా వలస కార్మికులకు సంక్రమించు అంటు వ్యాధులపై అవగాహనా కల్పించాలని చెప్పారు. అత్యవసరమైన కేసులను సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామజిక ఆరోగ్య కేంద్రం, లేదా 108 వాహనం ద్వారా తరలించి సకాలంలో సత్వర వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా ఎఫ్‌డిపి అధికారి డాక్టర్ శ్రావణ్, కొత్తపట్నం ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి బాపట్ల

రైల్వేస్టేషన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకస్మికంగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో అగ్ని ప్రమాదాలతో పాటు పిడుగుపాటు వంటి సంఘటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వర్లు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలల్లో బాగంగా 2వ రోజు పట్టణంలో గడియార స్తంభం సెంటర్, బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, సినిమా థియేటర్లలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కరపత్రాలు మంగళవారం పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలకు కారణాలు, నిరోధక పద్ధతులకు మార్గాలను వివరించారు. ప్రమాదం సంభవించిన తరుణంలో తక్షణమే తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. పాత బస్టాండ్ సెంటర్లో ప్రయోగాత్మకంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవలసిన చర్యలు వివరించారు.

రేపల్లె : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక ఇన్చార్జి అధికారి వై సాంబశివరావు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని హెూటల్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్ వంటి ప్రధాన రహదారులు వద్ద కరపత్రాలు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది స్థానిక రాజ్యలక్ష్మి సినిమా థియేటర్ సెంటర్లో నీటితో అగ్ని ప్రమాదాలు నివారించే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ డెమో నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ మెన్‌లు పాల్గొన్నారు.

పోషకాహారంపై తల్లులకు అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

మాట్లాడుతున్న రేపల్లె సిడిపిఒ ఎం సుచిత్ర

గర్భిణులు పోషకాహార లోపం నివారణకు సమతుల్య ఆహారం తీసుకోవాలని సిడిపిఒ ఎం సుచిత్ర తెలిపారు. పట్టణంలోని గరువు రోడ్డు అంగన్‌వాడీ సెంటర్లో పోషణ పక్వాడ పక్షోత్సవాలు మంగళవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. గర్భవతిగా నిర్ధారణైనప్పటి నుంచి బిడ్డపుట్టి రెండేళ్లు నిండే వరకు వేయి రోజుల పాటు పిల్లలకు మంచి పౌష్టికాహారం, సంరక్షణ పట్ల గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైసర్ శివజ్యోతి, అనిత పాల్గొన్నారు.

వేమూరు : పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవంపై చుండూరు మండలం తొట్టెంపూడిలో మంగళవారం నిర్వహించారు. అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మోదుకూరు సెక్టార్ పరిధిలోని తొట్టింపూడిలో సూపర్వైజర్ నాగరాజ కుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సూర్యకల్యాణ్ చక్రవర్తికి పోస్ట్ డాక్టోరియల్ ఫెలోషిప్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఫెలోషిప్ అందుకుంటున్న సూర్యకళ్యాణ్ చక్రవర్తి

విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి మరో ఘనత సాధించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని యుసిఎఫ్ఐ విశ్వ విద్యాలయం నుంచి పోస్ట్ డాక్టోరియల్ ఫెలోషిప్ (పీడీఎఫ్) అందుకున్నారు. అంతర్జాతీయ పరిశోధన, నిర్వహణలో కంప్యూటర్ సైన్స్, డిజిటల్ ఇన్నోవేషన్ సహకారం ఒక ముఖ్యమైన మైలురాయి అనే అంశంపై కల్యాణ్ చక్రవర్తి పరిశోధన చేయటంతో పిడిఎఫ్ అందజేశారు. కౌలాలంపూర్‌లో ఈనెల 12న జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దాతుక్ టీఎస్ డాక్టర్ రోహన్ బింటీ యూసఫ్ కల్యాణ్ చక్రవర్తికి పిడిఎఫ్ సర్టిఫికెట్ అందజేశారు. డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాయూస్, క్విస్ కళాశాల గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ జాఫర్ పాల్గొన్నారు. పీడీఎఫ్ అందుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న కల్యాణ్ చక్రవర్తికి క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపల్ డాక్టర్ వైవి హనుమంతరావు, క్విస్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, సిబ్బంది ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

ప్రజాశక్తి - చీరాల

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు శాసన సభ్యులు కొండయ్య పేర్కొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, టిడిపి అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, అమర్నాధ్‌తో కలిసి మునిసిపల్ ఆఫీస్, మసీద్ సెంటర్, గడియార స్తంభం సెంటర్, రైల్వే స్టేషన్ నందు చలివేంద్రాలు ప్రారంభించారు. కమిషనర్ అబ్దుల్ రషీద్, డిఈ రఘురాం, మెప్మా సీఎంఎం కొండయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధృవ సోలార్ ప్రతినిధి

సౌర విద్యుత్తుపై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

ప్రతి గృహానికి సౌర విద్యుత్తు ఏర్పాటుకు పట్టణ ప్రజలు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ధ్రువ సోలార్ పవర్ ప్రతినిధుల ఆధ్వర్యంలో మెప్మా సిబ్బందికి సౌర విద్యుత్తుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధ్రువ సోలార్ పవర్ ప్రతినిధి మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ సోలార్ పథకం ద్వారా 25ఏళ్ళ సోలార్ లైఫ్‌తో గృహ సముదాయాలకు నెలకు 360 సోలార్ యూనిట్లను ఉత్పత్తి చేయడం ద్వారా విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చని అన్నారు. సౌర విద్యుత్తు ఏర్పాటుకు బ్యాంకు ద్వారా రూ 1.80వేలు మంజూరు చేస్తారని అన్నారు. 45రోజుల అనంతరం రూ.78వేలు సబ్సిడీ వస్తుందని అన్నారు. ఈ పెట్టుబడి మొత్తాన్ని నెలవారి వాయిదాల పద్ధతిలో చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

రాజ్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి - చిన్నగంజాం

మండలంలోని చింతగుంపల గ్రామానికి చెందిన బెజ్జం రాజ్ కుమార్ (25) కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు తెలిపారు. రాజ్‌కుమార్ అకాల మరణం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఫోన్లో ఎంఎల్ఏ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు రాజ్ కుమార్ అంత్యక్రియలకు టిడిపి ఇంకొల్లు, చిన్నగంజాం అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, పొద వీరయ్య, కొమ్మినేని వెంకట్, బెజ్జం అఖిల్ హాజరై నివాళులు అర్పించారు. పార్టీ నుండి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. గతంలో రోడ్డు ప్రమాదంలో కుటుంబానికి ఆదరువైన భర్తను కోల్పోవడం, ఆ లోటు మరువక మునుపే మరల చేతికి అందివచ్చిన కొడుకు రాజ్ కుమార్ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందటంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పర్చూరు

ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడే అధికారులు పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని ఎంపిపి మేక ఆనందకుమారి అధికారులకు సూచించారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. స్థానిక విద్యా వనరుల కేంద్రం సమావేశ హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులే చర్య తీసుకోవాలని కోరారు. ఎంపిడిఒ వి ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ వేసవిలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నట్లు తెలిపారు. రోజుకు రూ.300 కూలి వచ్చే విధంగా పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మన మిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇఓపిఆర్డి కె సత్యనారాయణ కార్యదర్శులను ఆదేశించారు. వివిధ శాఖలపై సమీక్ష చేశారు. ఎఒ రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ వేసవిలో రైతులు పోలాలకు భూసార పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలైనా జనము, జీలుగా, పిల్లి పెసర విత్తనాలు రైతులకు అందిస్తామని చెప్పారు. సొంత భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం యూనిక్ ఐడి ఇవ్వనున్నట్లు తెలిపారు. చెరుకూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బాబు మాట్లాడుతూ 104 సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. బిపి, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులు నెల నెల ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ చేసుకునే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎపిఒ రమేష్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రైతులకు ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నీటి వసతి ఉన్న చోట పశువులకు తాగునీటి తొట్టెలు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎపిఎం రామకృష్ణ మాట్లాడుతూ అర్హులైన ఎస్సీ, ఎస్టీ డ్వాక్రా సభ్యులకు ఆటో స్కీం అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఎంతమందికి అవసరమైతే అంతమందికి ఆటోలు సున్నా వడ్డీపై రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు ప్రభుత్వం డోర్ డెలివరీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. సిడిపిఒ జి సుభద్ర మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల ఆవరణలో మొక్కలు పెంచడానికి రూ.10వేలు మంజూరైనట్లు తెలిపారు. అంగన్‌వాడి బిల్డింగ్ రిపేర్లకు, టాయిలెట్ రిపేర్లకు, కరెంట్ బిల్లులకు నిధులు మంజూరు చేయాలని తెలిపారు. ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ 45 మంది విద్యార్థులున్న పాఠశాలను మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాగులుపాలెం ఉర్దూ స్కూల్ ఆవరణ పల్లంగా ఉండడంతో వర్షపు నీటితో నిండి పిల్లలకు ఇబ్బంది జరుగుతుందని, మెరక చేయాలని ప్రజా ప్రతినిధి కోరారు. భూ సమస్యలు పరిష్కరించాలని గ్రామ సభల్లో, తహశీల్దారు కార్యాలయంలో ఎన్ని అర్జీలు సమర్పించిన సమస్యలు పరిష్కారం కావడం లేదని సభ దృష్టికి తీసుకురాగా డిటి సుధారాణి వివరణ ఇచ్చారు. తక్షణమే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కోట ప్రసన్న, పాలేటి వీరయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ జి శివ నాగరాజు, పిఆర్ ఎఇ శ్రీనివాసరావు, ఎంపిటిసిలు కాపు రవిచంద్ర, పుల్లెల పద్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ఆనందకుమారి

మాట్లాడుతున్న డాక్టర్ పి శ్రీహర్ష

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గన్నవరం, పూనూరు గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తుల (పేషెంట్ల) కుటుంబ సభ్యులకు, వారితో దగ్గర సంబంధం కలిగిన వ్యక్తులకు సివైటిబి స్క్రీనింగ్ పరీక్షలు డాక్టర్ పి శ్రీహర్ష ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం, బరువు తగ్గుతున్న వారు, ఆకలి మందగించిన వారు సత్వరం ఆరోగ్య కేంద్రంలో సివైటిబి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కొరారు. క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్టూరు టిబి యూనిట్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ బి రాజశేఖర్, పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తంగెళ్ల విజయచంద్ర, శివప్రసాద్, హెల్త్ సూపర్వైజర్స్ నాగేశ్వరరావు, సునంద, ఎంఎల్‌హెచ్ పి రమ్య, ఎఎన్ఎంలు సులోచన, రాణి, జ్యోతి పాల్గొన్నారు.

న్యాయవాది శ్రీనివాసరావు మృతి

ప్రజాశక్తి - బాపట్ల

జి శ్రీనివాసరావు (80)

పట్టణంలో ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నేత గంగరాజు శ్రీనివాసరావు (80) అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. 1985లో బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తెలుగుదేశం అభ్యర్థి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చేతిలో ఓటమి చెందారు. అంతకు ముందు 1981లో బాపట్ల మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేశారు. తొలినుంచి కాంగ్రెస్‌కు అంకితమైన శ్రీనివాసరావు ఆ పార్టీలో చివరి శ్వాస వరకు కొనసాగారు. న్యాయవాదిగా బాపట్ల ప్రాంతంలోనే కాక రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకునిగా, న్యాయవాదిగా ఆయన గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, పుర ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు

పంగులూరులో మాట్లాడుతున్న ఎఒ డి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - పంగులూరు

ప్రకృతి వ్యవసాయంతో రైతులు ఎన్నో రకాల లాభాలు పొందే అవకాశం ఉందని పకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డిపిఎం జె మోహన్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ సిబ్బందితో మంగళవారం జరిగిన కన్వర్జెన్సీ మీటింగులో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక తయారీ, విధి, విధానాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించేందుకు మూడు రోజులపాటు ప్రతి గ్రామంలో గ్రామ సభలు, ర్యాలీలు నిర్వహించి రైతుల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. రాకపోతే కారణాలు, 2026కు ఎంత మందిని ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకొస్తామనే విషయాలు చర్చించామన్నారు. నవధాన్య సాగు ద్వారా భూమిలో సేంద్రీయ పదార్థం పెరిగి, భూమిలో ఉన్న సూక్ష్మ క్రిములు, బ్యాక్టీరియా పెరుగు తాయని అన్నారు. ఎఒ డి సుబ్బారెడ్డి మాట్లాడు తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. భూమిని సారవంతం చేయడానికి తీసుకోవలసిన పద్ధ తులు, రసాయన ఎరువులు, పురుగు మందులు వాడ కుండా సహజసిద్ధంగా ప్రకృతిలో లభించే సేంద్రియ ఎరువులను ఉపయోగించడం ద్వారా మంచి ఆరోగ్య కరమైన పంటలు దిగుబడి పొందవచ్చని అన్నారు. ఎపీఎం జ్యోతి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీసీలు చాట్ల సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, మండల సమైక్య అధ్యక్షురాలు వజ్రాల కమలాదేవి, విఎఎలు, విఒఎలు, గ్రామ సంఘాల ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

కారంచేడు : మండల సమైక్య కార్యాలయంలో ఎపి కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫార్మింగ్ మండల ప్రణాళిక, మండల స్థాయి శిక్షణ మంగళవారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను గుర్తించి, వారికి సహాయ సహకారాలు అందించాలని ప్రాజెక్టు జిల్లా అధికారి వి వాణిశ్రీ అన్నారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పంట కాలానికి సంబంధం లేకుండా సాగు భూమిని సజీవ వేరు వ్యవస్థతో ఎల్లప్పుడూ కప్పబడి ఉండే ప్రక్రియ వివరించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఈపిఎండిఎస్ విధానాన్ని నవధాన్యాల సాగు పద్ధతిగా పిలుస్తారని అన్నారు. ఎడిఎ ఎన్ మోహనరావు ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలు, రసాయిన వ్యవసాయం వలన కలిగే అనార్థాలు వివరించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు బోయిన వెంకటేశ్వర్లు, బీమరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారంచేడులో మాట్లాడుతున్న పిడి వి వాణిశ్రీ

అధికారులు సమన్వయతో పని చేయాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ మహమ్మద్ ఫరూక్, పంచాయతీ రాజ్ ఎఇ ఎం వెంకటేశ్వర్లు, సిడిపిఒ సిహెచ్ భారతి, స్పెషల్ ఆఫీసర్ ఎన్‌వి రమణ, డిపిఎం సుభాషిణి, తహశీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ జనార్ధన్, వైద్యాధికారి డాక్టర్ బి మధు శంకర్, ఎం జాస్మిన్, పశువైద్యాధికారిని ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి సుంకర సునీత

ఎస్‌పిని కలిసిన పిటిసి డిఎస్‌పి బాల సుందరరావు

ఎస్‌పిని కలిసిన పిటిసి డిఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌పి ఏఆర్ దామోదర్‌ను పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ డిఎస్‌పి ఎం బాల సుందరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. సాధారణ బదిలీలో భాగంగా పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి డిఎస్‌పిగా ఎం బాలసుందరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు. ఆయనను ఎస్‌పి అభినందించారు.

డాక్టరేట్ అందుకుంటున్న గుర్రం మురళీమోహన్

మురళీమోహన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గుర్రం మురళీమోహన్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు సందర్భంగా హైదరాబాదులో సమాజ సేవ చేస్తున్న వారికి, ప్రపంచ శాంతి కోసం పాటుపడేవారికి, మానవ హక్కుల కోసం పోరాడే వారికి మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనకు డాక్టర్ ఆఫ్ హ్యూమానిటీ అనే విభాగంలో డాక్టరేట్‌ను హైదరాబాదు ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సిటీ కల్చర్ కళావేదికలో మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో, కృష్ణా నది వరదల సమయంలో విద్యార్థినీ, విద్యార్థులకు చేసిన సేవలకు గుర్తింపుగా, సంఘ నాయకునిగా, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చేసిన సేవలకు గుర్తింపుగా భారత్ సేవా రత్న జాతీయ అవార్డును ఇచ్చారని తెలిపారు. మనం ఫౌండేషన్ చైర్మన్ కె చక్రవర్తి, దైవాజ్ఞ శర్మ సరస్వతి, శ్రీరామ్ మూర్తి, త్రినాధరావు, శ్రీపాద, సుబ్బరాజు, కె అర్చన, డాక్టర్ శివ లీల ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

రూ.70 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అద్దంకి

ముండ్లమూరు మండలంలోని చిన్నఉల్లగల్లు గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు తప్పెట ఆదిత్య కిడ్నీ, లివర్, యూరినల్ సమస్యతో గత మూడేళ్ల నుండి బాధపడుతున్నాడు. చికిత్స పొందుతూ ఆర్థికంగా క్రుంగిపోయి తన తల్లి, దండ్రులు చిన్న, రాజమ్మ సేవాస్ఫూర్తి కమిటీ మిత్రుడైన ఆ గ్రామానికి చెందిన స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న బత్తుల పురుషోత్తంను సాయం చేయమని సంప్రదించగా తను ఆ విషయం 1989-90 బ్యాచ్ గ్రూపులోని మిత్రులకు సమాచారం అందించగా రూ.70వేలు సమకూర్చి పట్టణంలోని గీతా మందిరంలో బాలుని తల్లి, దండ్రుల సమక్షంలో మంగళవారం నగదు అందించారు. సేవాస్ఫూర్తి కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ నేరల శ్రీనివాసరావు, బత్తుల పురుషోత్తం, జాయింట్ సెక్రెటరీ ధర్మవరపు వెంకటరావు, ట్రెజరర్ కొత్త శ్రీమన్నారాయణ, కుందా బాలాజీ, గార్లపాటి మురళీకృష్ణ, ఘంటసాల శ్రీనివాసరావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జవ్వాజి సత్యనారాయణ, బెల్లం రాజేష్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ అన్నారు. మండలంలోని సిఎస్‌పురం, ఉప్పలపాడు, గుంత చెన్నంపల్లి, నల్లమడుగుల, మిట్టపాలెం, ఆర్కే పల్లి, డీటీ పల్లి తదితర గ్రామాలలోని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పేదలు గతంలో తహశీల్దార్‌కు అర్జీలు అందజేసి ఉన్నారు. ఈ అర్జీల పరిష్కారం విషయం ఎంతవరకు వచ్చిందనే దానిపై ఆయా గ్రామాలకు చెందిన పలువురు అర్జీదారులతో కలిసి సిపిఎం నాయకులు మంగళవారం తహసిల్దార్ డి మంజునాథరెడ్డి కలిశారు. ఆయా గ్రామాల్లోని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మంజునాథరెడ్డి నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంపై సిపిఎం నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఆన్లైన్లో ప్రాసెస్ మొదలైన వెంటనే అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చే ఏర్పాటు చేస్తామని తహశీల్దార్ మంజునాథరెడ్డి వివరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, బక్క జేసురత్నం, పలువురు అర్జీదారులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

'కేశవరాజుకుంట' అక్రమణలపై దామచర్ల స్పందించాలి..

- పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం
- వైసిపి ఒంగోలు ఇన్‌ఛార్జి చుండూరు రవిబాబు

మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నగర పరిధిలో కేశవరాజుకుంటలో 5.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న ఘటనపై శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు స్పందించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరు రవిబాబు డిమాండ్ చేశారు. తమ పార్టీ నేతలు ఆ స్థలాన్ని పరిశీలించారని, ఆ స్థలం పక్కనే మరో రెండెకరాలు దున్నినట్లు గుర్తించారన్నారు. మంగళవారం నాడు వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేశవరాజుకుంట ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టక పోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనికి ఎమ్మెల్యే బాధ్యత వహించాలన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలం చెందిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వ్యాపారుల పక్షం వహిస్తూ రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. వ్యాపారులు పార్టీకి ఆర్థికంగా అండగా ఉంటారని, రైతుల ఆర్థిక సహకారం ఇవ్వలేనందున ఆ పార్టీ వ్యాపారుల పక్షం వహిస్తోందన్నారు. పంటలపై బోనస్ ప్రకటించి కొనుగోలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పొగాకు గిట్టుబాటు ధరపై ఆందోళన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గత ఐదేళ్ల కాలంలో రైతులు సంతోషంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కాగా గత ఏడాది పార్లమెంట్ సభ్యులు వైవి సుబ్బారెడ్డి కేంద్రంతో చర్చించి పొగాకుకు మద్దతుధర రాబట్టేందుకు కృషి చేసిన వైనాన్ని గుర్తు చేశారు. ఆక్వా రైతుకు విద్యుత్ యూనిట్ రూ 1-50 లు, ట్రూ అప్ చార్జీల రద్దు చేస్తామన్న ప్రభుత్వ హామీ అమలు కాలేదని విమర్శించారు. రొయ్య రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. సమావేశంలో వైసిపి బిసిసెల్ జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల సుబ్బారావు, ఒంగోలు మండల పార్టీ అధ్యక్షులు మన్నే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగుత్తికొండ నారప రెడ్డి, నగర కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-చీమకుర్తి

బడిఈడు పిల్లలు నూటికి నూరు శాతం బడిలోనే ఉండాలని, అందుకు అనుగుణంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పి.నాయుడుపాలెం గ్రామ సచివాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఎన్రోల్మెంట్, డ్రాప్ అవుట్స్ వివరాలను పాఠ శాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. జిల్లాలో బడిఈడు పిల్లలు వందకి వంద శాతం బడిలోనే ఉండాలని, అందుకు అనుగుణంగా ఎన్రోల్మెంట్ డ్రైవ్, ట్రాన్సిషన్, డ్రాప్ అవుట్స్ సంబంధించి మండల స్థాయి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ తయారు చేసే విధానాన్ని ఐసిడిఎస్ సిబ్బంది డెమో చేయగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్ కుమార్, ఎంఇఒలు డివిఎల్ నరసింహారావు, కే శివాజీ, ఐసిడిఎస్ అధికారి ఇవాంజెలియన్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వివిధ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

వాట్సాప్ గవర్నెన్స్ పరిశీలించిన కలెక్టర్

పి నాయుడుపాలెంలో జరుగుతున్న వాట్సాప్ గవర్నెన్స్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో కలిసి పి అనిత ఇంటికి జిల్లా కలెక్టర్ వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర పేరుతో ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ ముఖ్య ఉద్దేశాన్ని, దానివల్ల కలుగు ప్రయోజనాలను స్వయంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, తహశీల్దార్ ఆర్ బ్రహ్మయ్య, ఎంపీడీవో వి శ్రీనివాసరావు, గ్రామ సెక్రటరీ శంకర్, వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

యువతను క్రికెట్ బెట్టింగ్‌లకు ప్రోత్సహించే వారిని ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు వారి పరిధిలోని హోటళ్ళు, లాడ్జిలు, రిసార్ట్స్, దాబాలు, రెస్టారెంట్ లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులను విచారించారు. బస చేసే ప్రతి ఒక్కరి వివరాలు క్షుణ్ణంగా నమోదు చేసుకోవాలని నిర్వాహుకులకు తెలిపి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్లు, లాడ్జిలు, రిసార్ట్స్, దాబాలు, రెస్టారెంట్ లను రాత్రి పోలీస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో కొంతమంది స్వార్థపరులు వారి స్వలాభం కోసం యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ లు నిర్వహించినా, ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు.

రైల్వేస్టేషన్‌లో కరపత్రాలు పంచుతున్న అధికారులు

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో అగ్ని మాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఒంగోలు ఎపిఎస్ ఆర్టీసి గ్యారేజీలో పనిచేసే సిబ్బందికి ఆయిల్స్‌తో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా నివారించాలో డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. బస్సులలో అగ్ని నిరోధక పరికరాలు ఉంచుకోవాలని అగ్నిమాపక అధికారులు సూచించారు. బస్టాండ్ ఆవరణలోని ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు, గ్యారేజ్ ఇంచార్జ్ ఎస్. విజయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో, ఒంగోలు రైల్వేస్టేషన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసుల రెడ్డి, ఒంగోలు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

5.10 ఎకరాల భూమి మాదే..

ముక్తినూతలపాడు రైతుల వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మండలం ముక్తినూతలపాడు గ్రామ సర్వేనెంబర్ 15/1 లోని 5.10 ఎకరాల భూమి తమదేనని, 1947 నుండి ఆ భూమి తమ ఆధీనంలోనే ఉందని, పాస్ బుక్‌లతో సహా అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని ఈ భూమిపై ఎటువంటి అపోహలు వద్దని ఆ గ్రామ రైతులు పేర్కొన్నారు. ఒంగోలు మండలం ముక్తినూతలపాడు గ్రామ సర్వేనెంబర్ 15/1లో ఇటీవల మీడియాలో వచ్చిన కథనాలపై వారు స్పందించి మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రైతు సూదనగుంట హరిబాబు మాట్లాడుతూ సర్వే నెంబర్ 15/1లో 5 ఎకరాల 10 సెంట్ల భూమిని పోలీస్ విభాగంలో పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్‌ఖాదర్ 1947లో సూదనగుంట వెంకట సుబ్బయ్యకు విక్రయించారన్నారు. అప్పటినుండి ఆ భూమి తమ స్వాధీనంలోనే ఉందని, ఆరుగురు అన్నదమ్ములు పంచుకోగా తలా 85 సెంట్లు భూమి వచ్చిందన్నారు. అప్పటినుండి తాము పన్ను చెల్లించటంతో పాటుగా సాగులో ఉన్నామన్నారు. సూదనగుంట కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ భూమిని బొల్లినేని అంజిబాబు అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చామని, ఆయన వ్యవసాయం చేసుకునేందుకు, పంటలను కాపాడుకునేందుకు చుట్టూ ఫెన్సింగ్ వేశారని తెలిపారు. ఈ భూమిపై మీడియా పలు రకాల కథనాలు ప్రచురించటం బాధాకరమన్నారు. తమ వద్ద అన్ని రకాల పత్రాలు భద్రంగానే ఉన్నాయని తెలిపారు. ఎవరికైనా అనుమానం ఉంటే తమ వద్దకు వచ్చి పత్రాలు అడిగితే ఇస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సూదనగుంట కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముక్తినూతలపాడు రైతులు

బాల్యవివాహాలను అరికట్టేందుకు చర్యలు

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాల్యవివాహాలను అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు సూచనలు చేశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాల వలన తల్లికి, పుట్టే బిడ్డలకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఏర్పడతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.బాల్య వివాహాలను నిషేధించాలని, పూర్తిగా అరికట్టాలని అన్నారు. బాల్య వివాహాలపై పూజారులకు, ఇమామ్లకు, పాస్టర్లకు అవగాహన కల్పించాలన్నారు.

కలెక్టర్ వెంకటమురళి

మున్సిపాలిటీలు, మండల పరిషత్ బడ్జెట్లో 15శాతం నిధులను అంగన్ వాడి సెంటర్లకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆ నిధుల ద్వారా అంగన్‌వాడి సెంటర్లకు కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం ఉపయోగిస్తారని అన్నారు. పాఠశాలలో పదో తరగతి చదివి పాసై ఇంటర్మీడియట్ కు వెళ్లే విద్యార్థులు తప్పనిసరిగా ప్రభుత్వ కళాశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వీక్షణ సమావేశం ద్వారా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి..

గృహ నిర్మాణాలలో లక్ష్యాల మేరకు అధికారులు పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గహ నిర్మాణాలపై ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పేదలకు మంజూరు చేస్తున్న పక్కాగహాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. గృహాల నిర్మాణాలలో చీరాల డివిజన్ పురోగతి లేకపోవడంపై సంబంధిత డిఈని ప్రశ్నించారు. గహాలు మంజూరైన వారికి ఉపాధి హామీ కింద పని దినాలు కల్పించాలన్నారు. లబ్ధిదారులకు బిల్లుల సమస్యలు రానివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. అద్దంకి, చీరాల, చినగంజాం మండలాలలో గృహ నిర్మాణ పనులు జరగకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి వై వెంకటేశ్వరరావు, డిఈలు, ఏఇలు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులలో పురోగతి చూపాలి

కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-చీమకుర్తి

జిల్లాలో ఉపాధి హామీ కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు అందరికీ పనులు కల్పించి.. పురోగతి చూపాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళ వారం ఆమె మండలంలోని పి నాయుడు పాలెం పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట పశువుల నీటి తొట్టి నిర్మాణాన్ని పరిశీలించారు. నాణ్యతతో త్వరగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్‌ను ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ ద్వారా ఫీడర్ ఛానల్‌లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల దగ్గరకు వెళ్లి ఎన్ని రోజుల నుంచి పనిచేస్తున్నారు.., ఎంత పని చేశారు.? అని వారిని అడిగి సమాధానం రాబట్టారు. హాజరు పట్టిక ప్రకారం కూలీలు హాజరయ్యారా.? లేదా.? అని పరిశీలించారు. అనంతరం కూరాకుల వెంకటేశ్వర్ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పొలంలో ఏర్పాటుచేసిన ఫారం పాండ్‌ను కలెక్టర్ పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా జోసఫ్‌కుమార్, తహశీల్దార్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్